క్లుప్తంగా

సమాచార చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వసంతరావు నాయక్

దర్శి: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ వసంతరావు నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రావులు సూచించారు. రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన ఎటువంటి సమాచారం అయినా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఏకారణం చేతనైనా ఇవ్వని పక్షంలో పైఅధికారికి అప్పీల్‌కు వెళ్లవచ్చన్నారు.

జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

దర్శి: జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక దర్శి కిజీజీ స్కూల్లో బుధవారం జరిగింది. కేవీ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కె.సుబ్రహ్మణ్యం, బి.దేవదాస్‌లు హాజరయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ బి.కోటిరెడ్డి, కె.ప్రభుదాస్, అధ్యక్షుడిగా కేవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.విజయభాస్కర్, కోశాధికారిగా ఎస్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బీవీ హర్షవర్ధన్ రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, వై.మారుతి కిరణ్‌రెడ్డి, జి.వేణు, ఎస్. తిరుపతిరెడ్డి, కార్యదర్శులుగా కె.రోశయ్య, ఎం.శ్రీనునాయక్, ఎస్‌కే పీరా సాహెబ్, జి.కోటేశ్వరరావు, పిల్లి శ్రీనివాసరావు, సమత కన్వీనర్‌గా ఎల్‌ఆర్ స్రవంతిలు ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' సభ

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభ గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరవుతారని, తొలుత ఆర్టీసీ బస్టాండ్‌లో దివంగత నేత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా సభ ప్రాంగణం వద్దకు చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ వివిధ విభాగాల జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కృష్ణారెడ్డి కోరారు.

సేంద్రియ ఎరువులతో ఖర్చులు తగ్గించుకోవచ్చు



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

పెద్దారవీడు: పంటలకు తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడాలని, వాటి స్థానంలో జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకంతో సేద్యం ఖర్చులు తగ్గించుకోవాలని మార్కాపురం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ డి.బాలాజీ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని బి.చెర్లోపల్లిలో ఖరీఫ్ పంటల్లో సమీకృత పంటల యాజమాన్యంపై రైతులకు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో అనువైన పంటల రకాలు.. వాటి గుణగనాల గురించి వివరించారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా పొలంలో లోతైన దుక్కులు దున్నుకోవాలని, తద్వారా భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చని చెప్పారు. అన్నదాత పథకంలో డబ్బులు జమ కాని రైతులు రైతు సేవా కేంద్రంలోని గ్రీవెన్స్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆత్మ పథకం బీటీఎం సురేఖ, ఏఈఓ సునీల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

కూలుతున్న కొండచరియలు

- రోడ్లకు అడ్డుగా పడుతుండటంతో ట్రాఫిక్‌కు అవస్థలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- ఘాట్ రోడ్లలో జాగ్రత్తలు అవసరమంటున్న అధికారులు
- వర్షాలతో పొంచి ఉన్న ముప్పు



కొండరాళ్లను జేసీబీతో తొలగింపజేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు ఘాట్ రోడ్లలో తరుచూ కొండ చరియలు విరిగి పడుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు భారీగా కొండ రాళ్లు రోడ్డుకు అడ్డంగా పడుతున్నాయి. ఆయా రోడ్లలో ప్రయాణించే భక్తులు, యాత్రికులతో పాటు వాహనదారులు గంటల కొద్దీ దట్టమైన నల్లమల అభయారణ్యంలోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నల్లమల అభయారణ్యంలోని రోళ్లపెంట, చింతల ఘాట్, తుమ్మల బైలు ఘాట్ రోడ్లలో ఎక్కువగా ఈ సంఘటనలు చోటు చేసుకుంటుండంతో ప్రయాణికుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మధ్య దూరం 50 కిమీ ఉంటుంది. రోళ్లపెంట నుంచి పెద్దదోర్నాల వరకు 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రెండు రహదారుల ఘాట్ రోడ్లలోనే ఉంటాయి. ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది భక్తులు వందలాది వాహనాల్లో ఈ మార్గంలోనే శ్రీశైలం వెళ్తారు. తరుచూ ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడుతున్నాయి. దశాబ్దాల క్రితం ఆయా ఘాట్ రోడ్లలోని లోయలను తొలచి రోడ్లను నిర్మించారు. దీంతో కొండ ప్రాంతాల నుంచి వర్షపు నీరు జాలువారు తుండటంతో పలుచోట్ల కొండలపై నుంచి కొండచరియలు విరిగి పడి రాకపోకలకు తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీంతో పాటు శ్రీశైలం రహదారిలో ప్రమాదకర మలుపులతో కూడిన ఘాట్ రోడ్లు ఎన్నో ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో 500 అడుగులపైనే లోతున్న ప్రమాదకర లోయలున్నాయి. ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా పడిన బండరాళ్లను తప్పించే క్రమంలో వాహన చోదకులు తమ వాహనాలను లోయల పైపు మళ్లిస్తే ప్రమాదాలు తీవ్రత అధికంగా ఉంటుంది. ఏటా రోడ్ల మరమ్మతుల కోసం కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు

వర్షాకాలం నేపథ్యంలో ఘాట్ రోడ్లలో కొండ చరియలు విరిగి పడుతుండటంతో భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వర్షాలకు తుమ్మలబైలు సమీపంలోని ఘాట్ రోడ్డులోని ఓ ప్రాంతంలో కొండ రాళ్లతో పాటు రహదారి అంచులు సైతం లోయలోకి జారిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు జేసీబీలతో రోడ్డుకు అడ్డంగా పడిన కొండ రాళ్లను తొలగించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాయి. దీంతో పాటు కర్నూల్ రోడ్డులోని రోళ్లపెంట వద్ద నున్న ఘాట్ రోడ్డులో భారీగా కొండచరియలు విరిగి పడటంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడయ్యాయి. ఇలా తరుచూ జరుగుతున్న సంఘటనతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఘాట్ రోడ్లలో రక్షణ చర్యలు చేపట్టి ప్రయాణికులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంప్యూటర్ల వద్ద లేని ఉద్యోగులు

ఆ సచివాలయానికి సెలవట!

- వీసీపల్లి సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం

దర్శి: మండలంలోని వెంకటాచలంపల్లి పంచాయతీలోని సచివాలయంలో బుధవారం ఖాళీ కుర్చీలు దర్శమిచ్చాయి. సచివాలయంలో కనీసం ఒక్కరంటే ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడం గమనార్హం. పలు అవసరాలపై వచ్చిన ప్రజలు గంటల తరబడి చూసి ఎవరూ రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. ప్రభుత్వ కార్యాలయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా విధులకు హాజరు కాకపోవడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ సచివాలయంలో రాజకీయ జోక్యం మితిమీరింది. టీడీపీ నేతలు ఏం చెప్తే అధికారులు అదే పాటిస్తూ నిబంధనలు సైతం ఉల్లంఘిస్తున్నారు. వారు చెప్తే పనులు చేసే వారుంటే చాలు సచివాలయానికి వచ్చినా రాకపోయినా వారు విధుల్లోనే ఉంటారు. అలా కాదని ఎవరైనా వారికి తెలియకుండా పనులు చేశారో వారు బదిలీపై వెళ్లాల్సిందే. సచివాలయం పరిధిలో వెంకటాచలంపల్లి, చలివేంద్ర, అబ్బాయిపాలెం, నడింపల్లి గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో ఒక పింఛన్ మంజూరు చేయాలన్నా, రేషన్ కార్డు మంజూరు చేయాలన్నా టీడీపీ నేతల సిఫార్సులు ఉండాల్సిందే. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు ఎవరైనా ప్రభుత్వ పథకాలు తమకెందుకు ఇవ్వరని గట్టిగా అడిగితే కనీసం సమాధానం చెప్పే వారు కూడా కరువయ్యారు. గ్రామ కార్యదర్శి సచివాలయానికే రావడం లేదు. నెలలో రెండు మూడు సార్లు మాత్రమే వచ్చి ఇన్‌చార్జిగా ఉన్న తూర్పు చౌటపాలెం వెళ్తున్నాని ఇక్కడ చెప్పడం, అక్కడకూ వెళ్లకుండా డుమ్మా కొడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరితో పాటు సచివాలయంలో ఉద్యోగులది కూడా ఇదే పరిస్థితి. పలు అవసరాలపై వచ్చిన ప్రజలు తమ అవసరాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వేచి చూసి వెళ్లిపోతున్నారు. ఏవైనా పనులు ఉంటే టీడీపీ నేతలు ఫోన్ చేసి చెప్తేనే చేస్తున్నారు తప్ప సామాన్యుడికి ఒక్క పని కూడా జరగడం లేదు. విషయమై ఎంపీడీఓ వసంతరావును వివరణ కోరగా ఆయన ఫోన్‌లో స్పందించలేదు.



సచివాలయంలో ఖాళీ కుర్చీలు



మరో గదిలో కూడా లేని ఉద్యోగులు



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు



ఎమ్మెల్యే తాటిపర్తిని సంప్రదాయ నృత్యంతో స్వాగతిస్తున్న గిరిజన మహిళలు

కరువు గడ్డపై రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండా

- పుల్లలచెరువు ర్యాలీలో అలరించిన గిరిజన నృత్యాలు
- ఎమ్మెల్యే తాటిపర్తి తలకు పటక చుట్టి స్వాగతం పలికిన మహిళలు

యర్రగొండపాలెం: జిల్లాలో పూర్తిగా వెనకబడిన పుల్లలచెరువు గడ్డపై వైఎస్సార్ కాంగ్రెస్ జెండాలు రెపరెపలాడాయి. బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆ మండలంలోని ప్రతి గ్రామం, గిరిజన గూడెం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభా ప్రాంగణానికి చేరారు. ముందుగా పార్టీ జెండాలు పట్టుకొని ఊరి వెలుపుల నుంచి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌కు వారు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయం ప్రకారం ఆయన తలకు పటక చుట్టి, శాలువాలు కప్పి మహిళలు నృత్యాలు చేసుకుంటూ ర్యాలీలో కదం తొక్కారు. పుల్లలచెరువు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెంచు యువత కోలాహలంగా కోలాటంలో పాల్గొని అలరించారు. ర్యాలీలో అడుగు అడుగునా..జగనన్న జిందాబాద్, తాటిపర్తి నాయకత్వం వర్ధిల్లాలి, రాక్షస పాలనకు స్వస్తి పలుకుదాం.. అంటూ నినాదాలు చేశారు. వేదిక వద్ద వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ఎమ్మెల్యేకు హారతి పట్టి స్వాగతించారు. యువకులు తమ మోటారు బైక్‌లకు పార్టీ జెండాలు కట్టుకొని ర్యాలీ చేసి కూటమి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నట్లు వారిలో భయం పుట్టించారు. వేదికపై ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకుల ప్రసంగాలకు చప్పట్లు చరిచి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా యాక్టింగ్ కమిటీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ కార్యదర్శి భూమిరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, జె.వెంకటేశ్వర్లు, పి.రమణయ్య, వీరారెడ్డి, బి.కోటిరెడ్డి, గడ్డం సుబ్బయ్య, దినేష్ యాదవ్, యూసఫ్ ఖాన్, కాశింవలి, రమణమ్మ, సూరె రమేష్, సింగా ప్రసాద్, వివిధ విభాగాల నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎల్.రాములు, జానకి రఘు, ఎం.సుబ్బారెడ్డి, ఆర్.ఆరుణాయి, వై.వెంకటేశ్వరరెడ్డి, డి.సుబ్బారెడ్డి, ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి, ఓబులరెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి, లక్ష్మానాయక్, కాశయ్య, ఎల్.ప్రసాద్, కేశవరెడ్డి, నారు వెంకటేశ్వరరెడ్డి, సరళాకుమారి, జెడ్పీటీసీలు ఆర్.వాగ్యానాయక్, ఎం.జాన్‌పాల్, సర్పంచ్‌లు తమ్మినేని సత్యనారాయణరెడ్డి, టి.మస్తాన్‌రెడ్డి, ఆవుల కోటివీరారెడ్డి, శ్రీనివాసులు, ఆవుల మల్లారెడ్డి, తాళ్లపల్లి సుబ్బారావు, ఆర్.బాలు నాయక్, బి.వెంకటేశ్వర్లు నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తాటిపర్తికి శాలువా కప్పి సన్మానిస్తున్న మహిళలు



బైక్ ర్యాలీలో వైఎస్సార్ సీపీ జెండాలను రెపరెపలాడిస్తున్న యువకులు

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

తాళ్లూరు: ఖరీఫ్–2025లో సాగు పంటలకు ఈ–పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు కోరారు. మండల కేంద్రం తాళ్లూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం ఈ– పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదుకు, కౌలుకార్డుకు రైతులు సహకరించాలని ఏఓ కోరారు. ప్రతి గ్రామంలో దండోరా వేయించి రైతులకు తెలియజేయాలని వీఆర్వో, వీఏఏలకు సూచించారు. వీఏఏ సాయిరాం, ఫిషరీస్ అసిస్టెంట్ మణికంఠ, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన

దొనకొండ: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసి అధికారులకు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రతి ఇంట్లో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ భారం తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఈ ఏడాది రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీలు అదనంగా మోపారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపు తక్షణమే ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. 2024–25 మధ్య వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన 2,787 కోట్ల రూపాయలు వెంటనే తిరిగి చెల్లించాలన్నారు. అదానీ కంపెనీతో జరిగిన సకీ ఒప్పందాలు రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లు విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. ప్రమాదకర విద్యుత్ సంస్కరణలు, చట్ట సవరణలు నిలిపి వేయాలని అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కుందుర్తి చిన్న నరసింహులు, యర్రగుంట్ల ప్రభాకర్, కోలా కిరణ్, రామయ్య పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులకు అర్జీ అందిస్తున్న అంజయ్య

బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు



వెంకాయమ్మకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని నాయుడుపాలెం పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన వెంకాయమ్మకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. పూల మాలలతో ఆమెను ఘనంగా సత్కరించారు. పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు బంక నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, ముదుర్లి వెంకట్ నారాయణ, రవి పాల్గొన్నారు.

ప్రసవించిన గంటలోపు పాలు తాగించాలి

కురిచేడు: బిడ్డకు మొదటి టీకా తల్లి ముర్రుపాలని, ప్రసవించిన గంటలోపు తల్లిపాలు తప్పకుండా పట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సునీత అన్నారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం బుధవారం బోధనంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సునీత మాట్లాడుతూ అపోహలు వీడి ప్రతి ఒక్కరూ తల్లిపాలను 6 నెలలు నిండేదాకా ఇవ్వాలని, 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలని, బిడ్డను రోగాల బారినపడకుండా కాపాడే ఒకే ఒక సంజీవిని తల్లిపాలని వివరించారు. పాలు ఇస్తే తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని వివరించారు. అనంతరం తల్లిపాలు ముద్దు.. డబ్బాపాలు వద్దు.. అనే నినాదంతో ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చెన్నారత్నం, లక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తాళ్లూరు: పసి బిడ్డలకు తల్లిపాలే శ్రేష్ఠమైనవని డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు బుధవారం నాగంబొట్లపాలెం విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో ప్రారంభించారు. తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలలో పోషక పదార్థాలు ఉంటాయన్నారు. పౌష్టిక ఆహారం తీసుకుంటే శిశువు ఎదుగుదల బాగుంటుందని చెప్పారు. ప్రతి తల్లి గర్భిణిగా ఉన్నప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకుంటే ప్రసవం తర్వాత శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా ఉంటుందని చెప్పారు. ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లి పాలే బిడ్డకు అందించాలని సూచించారు. హెచ్ఈఓ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

దొనకొండ: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు తాగిస్తే శ్రేష్ఠమని అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ నరసింహ, లోయలపల్లి కుమారి తెలిపారు. బుధవారం బాదాపురం గ్రామంలోని అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగిస్తే బిడ్డకు మంచి పోషకాలు లభిస్తాయని, మంచి ఆరోగ్యం తల్లి పాలలో ఉంటుందని, వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వర్ణకుమారి, ఆశా ధనలక్ష్మి, ఆయాలు సునీత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



తాళ్లూరు: మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



కురిచేడు: ర్యాలీ చేస్తున్న గర్భిణులు, బాలింతలు